నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
III | ఖమ్మం, బుధవారం 1 మే 2024 | BHADRADRI KOTHAGUDEM


మేళతాళాలతో బస్సుయాత్రకు స్వాగతం పలుకుతున్న కళాకారులు


రోడ్ షోలో ప్రసంగిస్తున్న కేసీఆర్. పక్కన ఖమ్మం అభ్యర్థి నామా, మహబూబాబాద్ అభ్యర్థి కవిత


కొత్తగూడెం త్రీటౌన్ సెంటర్‌లో జరిగిన రోడ్ షోకు హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



# నల్లనేలలో ఉద్యమ సూరీడు

- ఉప్పొంగిన అభిమానంతో కేసీఆర్‌కు నీరాజనం
- డప్పుచప్పుళ్లు, మహిళల కోలాటాలతో ఘన స్వాగతం
- గులాబీమయంగా మారిన కొత్తగూడెం రైల్వే స్టేషన్ సెంటర్
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గులాబీ బాస్ పర్యటన గ్రాండ్ సక్సెస్

సింగరేణి పురిటిగడ్డ కొత్తగూడెం ఉద్యమ సూరీడు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ఉప్పొంగిన అభిమానాన్ని చూపింది. ఖమ్మం జిల్లా నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి బస్సు యాత్ర అడుగిడిందే తడవుగా తమ అభిమాన నాయకుడిపై పూల జల్లు కురిపించింది. నల్ల నేలపై కాలుమోపిన గులాబీ బాస్‌పై అభిమానాన్ని గుబాళించింది. డప్పు చప్పళ్లతో కళాకారులు.. కోలాటాలు, నృత్యాలతో మహిళలు.. అడుగడుగునా పూలు చల్లుతూ భారీ ర్యాలీతో బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికారు. మెడలో గులాబీ రంగు రుమాలు, తలపై టోపీ, చేతిలో బీఆర్ఎస్ పార్టీ జెండాతో 'జయహో కేసీఆర్.. జైజై కేసీఆర్' అంటూ నినాదాలను హోరెత్తించారు. మంగళ వారం మధ్యాహ్నం నుంచే నిప్పుల కుంపటిలా ఉన్న ఎండ తీవ్రతను లెక్క చేయకుండా తండోపతండాలుగా కొత్తగూడెం త్రీటౌన్ సెంటర్‌కు చేరుకున్న జనం తమ అభిమాన నేత కేసీఆర్‌ను చూడగానే రెట్టించిన ఉత్సాహంతో ఈలలు, కేరింతలు కొట్టారు. వారి ఉత్సాహానికి రెట్టింపుగా కేసీఆర్ బస్సులో నుంచి చేయి ఊపుతూ.. అభివాదం చేశారు. అశేషంగా తరలివచ్చిన జన ప్రవాహాన్ని ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించినంత సేపు చాలా ఆసక్తిగా విన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండు రోజులపాటు సాగిన కేసీఆర్ రోడ్ షోలు సూపర్ సక్సెస్ కావడంతో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నిండింది.

*- ఖమ్మం, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

ఇదే కుట్రను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదే పదే చెప్తున్నడు

# భద్రాద్రి జిల్లాను తీసేస్తరంట...



- జిల్లా ఉండాలంటే 'కవిత', 'నామా'ను గెలిపించుకోవాలి
- గిరిజన గూడేనికి భగీరథ నీళ్లిచ్చిన విషయాన్ని గుర్తించండి
- జిల్లాకు అత్యధిక పోడు పట్టాలిచ్చిన చరితను గమనించండి
- ఇచ్చంపల్లి నుంచి గోదావరి జలాలు తరలిస్తే ఊరుకోబోం
- ఖమ్మం, మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థులకు అభయమివ్వండి
- సింగరేణి గడ్డపై బస్సుయాత్ర, రోడ్‌షోలో గులాబీ దళపతి కేసీఆర్
- కొత్తగూడెంలో కార్మికులను ఆకట్టుకున్న కేసీఆర్ ఉర్దూ ప్రసంగం

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ):పాలనను ప్రజలకు చేరువ చేయాలన్న సదుద్దేశంతో తాము చేపట్టిన సంకల్పాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సమాధి చేసేందుకు సిద్ధమవుతున్నారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. మారుమూల ప్రాంతాలకు జిల్లా కేంద్రం దగ్గరవ్వాలని ఏర్పాటు చేసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను తీసేసేందుకు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. అది అత్యంత దుర్మార్గపు చర్య అని దుయ్యబట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం కోసం పార్టీ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర, రోడ్‌షో మంగళవారం రాత్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఇక్కడి త్రీటౌన్ సెంటర్‌లో జరిగిన రోడ్‌షోలో ఖమ్మం, మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థులు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత సమక్షంలో అశేష ప్రజావాహినిని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. బీఆర్ఎస్‌పై కత్తి గట్టారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొత్త జిల్లాను తీసేయాలని చూస్తున్నాడని ఆరోపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇలాగే ఉండాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులు నామా, కవితలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే, మోసపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఏ ఒక్క వాగ్దానాన్నీ అమలు చేయలేకపోయిందని విమర్శించారు. అందుకే ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఎన్ని మాయమాటలు చెప్పినా ఆ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మడం లేదని అన్నారు. తమ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పినపాక నియోజకవర్గం దొంగతోగు అనే గిరిజన గ్రామానికి మిషన్ భగీరథ కార్యక్రమం ద్వారా గోదావరి జలాలను ఇచ్చామని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు అదే గోదావరి జలాలను కేంద్రంలోని బీజేపీ సర్కారు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలించుకుపోవాలని చూస్తోందని విమర్శించారు. గోదావరిపై ఇచ్చంపల్లి ప్రాజెక్టు ఎత్తు పెంచి అక్కడి నుంచి నీటిని తీసుకెళ్లే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. అదే జరిగితే ఇచ్చంపల్లి దిగువన ఉన్న సీతారామ ప్రాజెక్టుకు నీళ్లుండవని స్పష్టం చేశారు.

### కొత్త జిల్లాకు మెడికల్ కాలేజీని ఇచ్చాం..

పేద విద్యార్థులు, ఏజెన్సీ విద్యార్థులు కూడా వైద్యవిద్య చదవడం కోసం కొత్త జిల్లా అయిన కొత్తగూడేనికి కొత్తగా మెడికల్, నర్సింగ్ కాలేజీలను తమ ప్రభుత్వంలోనే ఇచ్చామని ఉద్యమ సారథి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తుచేశారు. పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఓవర్సీస్ పథకం ద్వారా రూ.20 లక్షల సాయం అందించామన్నారు. దీంతో పేద వర్గాల పిల్లలు విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకుంటున్నారని అన్నారు. అభివృద్ధి జరిగిందంటే అది బీఆర్ఎస్ సర్కారు పుణ్యమేనని అన్నారు. సింగరేణి బిడ్డలకు సాయం చేసిన ఘనత బీఆర్ఎస్ సర్కారుదేనని గుర్తుచేశారు. కార్మికులకు బోనస్‌లు, పండుగ అడ్వాన్సులు ఇచ్చామని, కారుణ్య నియామకాలు చేపట్టామని గుర్తుచేశారు. రెప్పపాటు కూడా కరెంటు పోకుండా విద్యుత్‌ను సరఫరాచేశామని, ఈ ఘనత రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందని స్పష్టం చేశారు. తాము 24 గంటలూ కరెంటు ఇస్తే.. ఇప్పటి ప్రభుత్వం ప్రతి రెండు గంటలకు ఒకసారి కరెంటు తీస్తోందని అన్నారు. కరెంటు లేక రైతులు కూడా ఆగమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చని పొలాలను బీళ్లుగా చేసిన పాపం కూడా కాంగ్రెస్‌కే చెందుతుందని దుయ్యబట్టారు.

### కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే..

కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒకటేనని కేసీఆర్ విమర్శించారు. ఆ విషయాన్ని ప్రజలు కూడా గమనిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్‌ను ఓడించేందుకే ఆ రెండు పార్టీలు ఒకటయ్యాయని దుయ్యబట్టారు. మతతత్వ బీజేపీ.. దేశంలో కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతోందని తూర్పారబట్టారు. వీటికి తగిన బుద్ధి చెప్పాలంటే ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కాగా, సింగరేణి గడ్డపై ముస్లిం సోదరులకు ప్రత్యేక నమస్కారాలు పెట్టిన కేసీఆర్.. పది నిమిషాల పాటు ఉర్దూలో చేసిన ప్రసంగం వారిని ఆకట్టుకుంది.

### నియోజకవర్గాల నుంచి పోటెత్తిన జనం..

కాగా, కొత్తగూడెంలోని రోడ్‌షోలో తమ అభిమాన నేతను చూసేందుకు, ఆయన ప్రసంగాన్ని ఆసాంతం వినేందుకు జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రజలు పోటెత్తారు. ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం నియోజకవర్గాల నుంచి తరలివచ్చారు. రోడ్‌షో వద్ద ఉద్యమ నేతను చూసేందుకు జనం పరుగులు పెట్టారు. ఈ యాత్రలో ఖమ్మం, మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థులు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. కాగా, ఖమ్మం నుంచి కొత్తగూడెం వచ్చే గులాబీ దళపతి బస్సుయాత్రకు వైరా, తల్లాడ, ఏన్కూరు, జూలూరుపాడు, సుజాతనగర్ ప్రాంతాల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారు.


కేసీఆర్ రోడ్ షోలో నృత్యం చేస్తున్న గిరిజన కళాకారులు


కొత్తగూడెంలో రోడ్ షో సందర్భంగా కళాకారుల ఆటాపాట